# జ్ఞానోదయం

సుల్తాన్‌బజార్లో ఓ ప్యాసింజర్ను దించి, ఎర్రగా అస్త మిస్తోన్న పొద్దుకేసి చూస్తూ మొహానికి పట్టిన చిరు చెమటను తుడుచుకోసాగాడు రాములు. రిక్షాలో కూర్చున్న ఓ ముసలాయన, వయస్సు యాభై పైన వుండొచ్చు; తెల్లగా, దృఢంగా ఉన్నాడు; బట్టతల, టూత్ బ్రెష్‌లాంటి మీసాలు, ముందుకు వ్రేలాడుతూన్న ముక్కు; గ్లాస్కో పంచె, లాల్చీ ధరించాడు; గబగబా కిందికి దిగి, రిక్షాలోని నాలుగు పుస్తకాల కట్టను తీసుకొని చంకలో పెట్టుకున్నాడు. లాల్చీ జేబులోంచి రూపాయినోటు తీసి యిచ్చి, ఆదరా బాదరా పక్క గల్లీలోకి నడిచి వెళ్లాడు అవతల అర్జంటు పని ఉండగా.

రిక్షా సీటు దులపటానికి ముందుకు వంగాడు రాములు. సీటు పక్కనే కళ్లజోడు పెట్టె వుంది. ఆ ముసలాయన దాన్ని తీసుకోవడం మర్చినట్టున్నాడు. ఇలాంటివి వయస్సులో వున్నవాళ్ళు మర్చిపోవడం కద్దు. కానీ వయస్సు మళ్లినవాళ్ళు మర్చిపోవడం బహు అరుదు. చివుక్కున వెనక్కు తిరిగిచూశాడు రాములు. ముసలాయన కనిపించ లేదు. ఎటు వెళ్లాడో, ఏమిటో! కాని 'అయ్యో! పాపం!' అనిపించలేదు రాములుకు. నెమ్మదిగా ఆ కళ్లజోడు పెట్టెను తీసి, ప్యాంటుజేబులో దోపుకున్నాడు వికసించిన వదనంతో.

ఎన్నోసార్లు ఎంతోమంది తన రిక్షాలో ఎన్నో వస్తువుల్ని మర్చిపోయారు. అవేమి వాళ్లకు ఎప్పుడూ దక్కలేదు. ఇదీ అంతే! ఏ కళ్లజోళ్ల షాపులో యిచ్చినా అయిదారు రూపాయలు రాకపోవు. నల్ల కళ్లజోడైతే పాతిక ముప్పై దాకా రావచ్చును. ముసలాడిది చత్వారపుజోడు. అద్దాలు పనికిరావు. ఫ్రేం అమ్ముకోవాల్సిందే! వూరక వచ్చిందానికి ఎంతొస్తేనేం?....

అంతలో, 'ఏయ్! రిక్షా!' అన్న కేక వినిపించింది రోడ్డు అవతల నుంచి.

ఉలిక్కిపడ్డాడు రాములు. కాని అతను ఇంకో మనిషి. రోడ్డు అవతల నిలబడి చేయి వూపాడు. వెంటనే బేరం తగిలినందుకు మురిసిపోతూ రోడ్డు అవతలకు వెళ్లాడు రాములు.

"బర్‌కత్‌పురా వస్తావా? ఆఠ్ అణా యిస్తాను."

బేరం ఆడకుండా తలాడించాడు రాములు. ఆ పెద్ద మనిషి రిక్షా ఎక్కి నిండుగా కూర్చున్నాడు. రిక్షా తొక్కసాగాడు రాములు.

బెల్ వాయించుకుంటూ, ఎదురుగా వస్తూన్న మనుషుల్ని, వాహనాల్ని తప్పించుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు రాములు. ఆ తొక్కటం యాంత్రికమే. కాని అతగాడి మనస్సు పలు ఆలోచనలతో ముసురుపట్టినట్టుగా వుంది. ఆలోచనలన్నీ కళ్లజోడు పెట్టెమీదనే వున్నాయి. ఆ పెట్టెను ఏ షాపులో అమ్మాలి? ఎన్ని డబ్బు లొస్తాయి? ఆ డబ్బులతో రెండు సీసాలు సారా తాగి కోడిమాంసం తిని, రాత్రికి హాయిగా నిద్రపోవడమా? బ్రాకెట్ ఆడటమా?.... బ్రాకెట్ ఆటలో ఎంతో డబ్బు నాశనంచేశాడు.... ఎప్పుడూ పైసా లాభం రావటంలేదు. ఓపెనింగ్‌కూ, క్లోజింగ్‌కూ పొత్తు కుదరటంలేదు. తాను వేసే నంబర్లు కల్సిరావడం లేదు. క్రితంసారి ఇలాగే ఒకాయన రిక్షాలో పర్సు మర్చిపోతే అందులో రెండొందల పదిరూపాయల, డబ్బు దొరికింది. దాంతో బ్రాకెట్ ఆటలో వేలకువేలు సంపాయించవచ్చు ననుకున్నాడు. వారంరోజుల్లో పైసా లేకుండా సుప్తాగా పోయింది. చివరకు దిగులే మిగిలింది. పెద్దోడికి

తాళ్లూరు నాగేశ్వరరావు

జబ్బుచేస్తే మందులకు అప్పు చేయాల్సివచ్చింది. ఏమిటో! ఎంత డబ్బు వచ్చినా బ్రతుకు గొర్రెతోకే! ఏడేళ్ల నుంచీ రిక్షా తొక్కుతున్నా, ఇంకా అద్దెరిక్షాయే! సొంత రిక్షా కొనుక్కునే స్తోమత చిక్కలేదు. ఎక్కడుందో లోపం! ఏరోజు కిరాయి తీసుకెళ్లకపోతే, ఆ రోజు పొయ్యిమీద కుండ ఎక్కదు....

అట్లా ఆలోచించుకుంటూనే రాములు బర్కత్‌పురా దాకా రిక్షా తొక్కుకెళ్లాడు. ప్యాసింజర్ను దించి, కిరాయి పుచ్చుకున్నాడు. జేబులో డబ్బులు వేసుకుంటూ, కళ్లజోడు పెట్టెను మరోసారి చూసుకున్నాడు. అది పదిలంగానే వుంది. దాన్ని చిక్కడపల్లిలో అమ్మి, ఆ డబ్బుతో కల్లుకాంపౌండ్‌లోకి పోదామనుకున్నాడు. ఆ ఉద్దేశంతోనే రాములు బర్కత్‌పురా నుంచి బయలుదేరాడు.

మధ్యలో చమన్ దగ్గర 'ఏయ్! రిక్షా!' అని ఎవరో కేకవేసినా వినిపించుకోకుండా ఖాళీరిక్షాను వడిగా తొక్కుకొచ్చాడు.

సూర్యుడు సొంతం కిందికి దిగిపోయాడు.

వీధుల్లో లైట్లన్నీ తెల్లగా వెలిగాయి.

నారాయణగూడా వంతెనమీదనుంచి రాములు వెళుతూండగా సోములు ఎదురయ్యాడు.

"అన్నా! అన్నా! నీ కోసమే సూస్తుండా" అన్నాడు సోములు ఆదుర్దాగా.

"ఏంరా? ఏం జరిగిందేమిటీ?" అన్నాడు రాములు రిక్షా ఆపి.

"నిన్ను మీ అడది అరిజంటుగా రమ్మన్నది. చంటిదానికి బావుండలేదంట. ఆస్పత్రికి తీసుకెళ్ళాలంట" అన్నాడు సోములు. ఆ కబురు చెప్పి వాడు వెంటనే రిక్షా తొక్కుకుని వెళ్ళాడు. వాడి రిక్షాలో ప్యాసింజర్లున్నారు.

రిక్షా చక్రానికి పంచరుబడి గాలి తుస్సునపోయినట్టు రాములు మొహంలో ఆనందమంతా జర్రున జారిపోయింది. ఛీ.ఛీ. ఎదవ బ్రతుకు? ఎప్పుడూ ఏదో వొకటి వొచ్చి మీద పడుతూనే వుంటుంది— అని తనకు తాను విసుక్కున్నాడు రాములు.

ఎప్పుడు రిక్షాలో ఏదిదొరికినా ఆ సంతోషం కొంచెం సేపుకూడా నిల్వదు. ఇంటో ఎవరో ఒకళ్ళకు ఏదో రోగం సడెన్‌గా వస్తూనే వుంటది. క్రితంసారి పర్సు దొరికినప్పుడు రెండోవాడు ఆటోకిందపడి చేయి విరగ్గొట్టుకున్నాడు. ఇప్పుడు చంటిదానికి వొంటో బావుండలేదంట. మహాచిత్రంగా వుంది. తను దొంగతనం చేయడంలేదు. దొరికింది పుచ్చుకుంటున్నాడు. అదీ తప్పేనా? నీతిమాలిన పనేనా?


ఇప్పుడు! మీ నెలసరి బిల్లులు మీ ఫిక్సెడ్ డిపాజిట్ మీద మేము ఇచ్చే వడ్డీతో చెల్లించండి



బ్యాంక్ ఆఫ్ బరోడావారి మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్‌లో చేరండి.

బ్యాంక్ ఆఫ్ బరోడా
(భారత ప్రభుత్వపు సంస్థ)

Imageads

ఇందులో ఏదో మడతపేచీ వుంది. ఇన్నాళ్ళనుంచీ తెలుసుకోలేకపోతున్నాడు. ఎన్నో రిక్షాల్లో, ఎవరెవరో ఏవేవో మర్చిపోతూవుంటారు. ఈ రిక్షా తొక్కేవాళ్ళంతా ఆ వస్తువుల్ని అప్పజెబుతున్నారా? మొన్న వెంకటేసు రిక్షాలో ఎవరో ఒకావిడ చేతిసంచీ మర్చిపోయింది. అందులో వున్న పదకొండు రూపాయలు వాడు తీసుకొని, ఆ సంచీని మూడు రూపాయల కమ్ముకోలేదూ! వాడి సంసారంలో ఎవరికైనా జ్వరమొచ్చిందా! ఎక్కడో నూటికీ, కోటికీ కోటేసులాంటి సత్యమంతులుంటారు. వాడి రిక్షాలో ఆ మధ్య ఎవరో డబ్బుసంచీ మర్చిపోతే, భద్రంగా తీసుకెళ్ళి యిచ్చి వేశాడట। పిచ్చి సన్నాసి! నీతికి నిలబడితే ఈ రోజుల్లో తాగటానికి నీళ్ళు దొరుకుతాయా?.... అనుకొంటూ నేరుగా ఇంటికొచ్చాడు రాములు.

చంటిదాన్ని పెట్టుకొని, గుడిసెముందు కూర్చునివుంది రాములు భార్య. మొగుడ్ని చూడగానే కన్నీళ్ళతో లేచి వొచ్చింది.

"సంటిదానికి పేనం బాగుండలేదయ్యా! డాకటేరు కాడకు తీసుకెళ్లాల."

"యామైంది?" అన్నాడు రాములు ఆదుర్దాగా.

"జొరం. మూసిన కన్ను తెరవటల్లేదు." అంది రాములు భార్య.

భార్యనూ, పిల్లనూ రిక్షాలో ఎక్కించుకొని అయిదు నిముషాల్లో డాక్టరు కోదండపాణి హాస్పటల్‌కు తీసుకెళ్లాడు రాములు. ఆ హాస్పటల్ తలుపులు మూసివున్నాయి. డాక్టరుగారు వూళ్లో లేరట.

'మరేంసేద్దాం!' అన్నట్లు కన్నీళ్ళతో మొగుడికేసి చూసిందిరాములు భార్య.

"ఎక్కు. మరో డాక్టరుకాడికి పోదాం" అన్నాడు రాములు.

జ్వరంతో వొణికిపోతున్న పసిదాన్ని వొళ్లో పెట్టుకొని రిక్షా ఎక్కింది రాములు భార్య. పావుగంటసేపు ఆ పేటంతా తిరిగి ఓ డాక్టరు బోర్డుదగ్గర రిక్షా ఆపాడు రాములు. వరండాలో రోగులు కిటకిటలాడుతున్నారు. కాని డాక్టరుగారు రోగుల్ని ఎవ్వర్నీ చూడడంలేదు. రాములూ, అతని భార్యా వరండాలోకి వచ్చారు. ఒక మూల నిలబడ్డారు.

డాక్టరుగారు బయటికొచ్చారు. ఆయన్ను చూడగానే రాములు మనస్సు చివుక్కుమంది. తన రిక్షాలో కళ్ళజోడు మర్చిపోయిన ముసలాయన ఆయనే. డాక్టరన్నమాట!

*With Best Compliments from*

**UNI-SANKYO LIMITED**

**Manufacturers of Quality Bulk Drugs**

*in Collaboration with*

**SANKYO COMPANY LIMITED, JAPAN**

*Factory :* Gaganpahad, Hyderabad-West. Andhra Pradesh

*Office :* 5-9-24/81, Shapurwadi, Hyderabad-500 483, A.P.

"ఇవాళ రోగులెవర్నీ చూడను. మన్నించి మరో చోటుకెళ్ళండి." అన్నాడు డాక్టరు.

'ఏం?' 'ఎందుకనీ?' 'ఏం జరిగిందీ?' మొదలైన ప్రశ్నలు గుసగుసల రూపంలో రోగుల్నుంచి వెలువడ్డాయి."

"ఏంలేదు. నా కళ్ళజోడు పోయింది. ఎక్కడో పెట్టి మర్చిపోయాను. రేపు సాయంత్రానికి గానీ కొత్త కళ్ళజోడు రాదు. కళ్ళజోడు లేకపోతే దగ్గరిచూపు ఆనదు." అన్నాడు డాక్టరు.

రోగులంతా ఒకళ్ళ మొహాలొకళ్ళు ఎగాదిగా చూసుకున్నారు. అందరి మొహాల్లోనూ ఏదో రకమైన నిరాశే! మళ్ళీ ఇంకో డాక్టరు దగ్గరకు వెళ్ళాలనే బాధే!

ప్యాంటు జేబులో చేయిపెట్టాడు రాములు. కళ్ళజోడు పెట్టె తగిలింది. కొన్ని క్షణాలపాటు ఆలోచించాడు. కళ్ళజోడు ఇవ్వటమా? మానడమా? ఇస్తే- ఈ రోగులనందర్నీ డాక్టరు చూస్తాడు. తన చంటిదాన్ని కూడా చూస్తాడు. ఇవ్వకపోతే- తనకు అయిదారు రూపాయలు దొరుకుతాయి. ఆ డబ్బుతో సారా తాగొచ్చు; కోడిమాంసం తినొచ్చు; బ్రాకెట్ ఆడొచ్చు. కాని.... కాని.... తన స్వార్థంకోసం ఇంతమంది మంచిచెడ్డలు చూసే డాక్టరుకు, మనిషికి ఏ జబ్బు చేసినా మందిచ్చే డాక్టరుకు, మనిషి రూపంలో ప్రాణదానం చేసే డాక్టరుకు అన్యాయం చేయడమా? ఛీ.ఛీ. ఈ పాడుబుద్ధి మానుకోవాలి. నీతి, నిజాయితీ గల బ్రతుకులోనే సుఖసంతోషాలున్నాయి. తన వ్యసనాల కోసం తన కుటుంబ క్షేమాన్ని పాడుచేసుకోవడమే కాక ఇతర్ల క్షేమానిక్కూడా అడ్డురావడం మనిషి లక్షణమేనా? రిక్షాలో దొరికిన వస్తువుల్ని ఇక ఎప్పుడూ తాను ఉంచుకోరాదు. ఎవరివి వాళ్ళకి ఇచ్చేయాల్సిందే!- గట్టిగా నిర్ణయించుకున్నాడు రిక్షా రాములు.

వెంటనే ప్యాంటుజేబులోంచి కళ్ళజోడు డాక్టరు గారి కిస్తూ-

"ఈ జోడు మీదేనండి. నా రిక్షాలో మర్చిపోయారు నిన్న సాయంత్రాన" అన్నాడు రాములు.

ఆ కళ్ళజోడును పెట్టెలోంచి తీసి, గబుక్కున కళ్ళకు తగిలించుకున్నాడు డాక్టరు. అక్కడున్నవాళ్ళంతా స్పష్టంగా కనబడ్డారాయనకు.

"నీతిమంతుడవోయ్! ఇదుగో, యీ అయిదు రూపాయలు తీసుకో!" అన్నాడు డాక్టరు.

ఆ మెచ్చుకోలుకు రిక్షా రాములు వొళ్ళు పులకరించింది. కాని ఆ పారితోషికాన్ని అందుకోలేదు.

"వొద్దుబాబూ! నా డ్యూటీ నేను చేశాను. ఒకరకంగా నా కళ్ళు మీరు తెరిపించారు. మనస్సులోని పాపాన్ని పోగొట్టారు."అన్నాడురాములు జ్ఞానోదయమైన సంతోషంతో.


# SRI VENKETESWARA AGENCIES

DEALERS IN PRINTING INKS PAPER STATIONERY

15-3-67/1, Gowli guda
Besides Gurudwara
Hyderabad-500 012
Phone P.P. 45113, 56634

5-5-156, First Floor
Lalatemple Road
Ranigunj, Secunderabad-500 003

**Distributors and Dealers for**

J. B. A. Printing Inks, Coates of India, United Inks & Varnish Co., Sanyal Lahiri & Co., Sai Printing Ink Co.. Hoogly Ink Co, Etc.